గ్రూప్-1 హాల్‌టికెట్లు రిలీజ్

హైదరాబాద్, జూన్ 1 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఈనెల 9న నిర్వహించనున్న గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష హాల్ టికెట్ల డౌన్‌లోడ్ ప్రక్రియ శనివారం మధ్యాహ్నం 2 గంటల తర్వాత ప్రారంభమైంది. ముందుగా ప్రకటించిన తేదీలోనే ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహించడానికి టీఎస్‌పీఎస్సీ ముమ్మర ఏర్పాట్లు చేస్తుంది. మరోపక్క పరీక్షను వాయిదా వేయాలని దరఖాస్తుదారులైన ఇన్‌సర్వీసు ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు.

గ్రూప్-1 వాయిదా వేయాలి

రవీంద్రభారతి, జూన్ 1: రాష్ట్రప్రభుత్వం గ్రూప్ -1 పరీక్షలను నెల వాయిదా వేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్ కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం బషీర్‌బాగ్‌లో ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 9న హెచ్‌ఎల్‌ఎల్, ఐబీ పరీక్షలు ఉన్నందున గ్రూప్– 1 ప్రిలిమ్స్‌ను వాయిదా వేయాలని కోరారు. లేకపోతే నిరుద్యోగులతో కలిసి ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.

గ్రూప్-1 ఒత్తిడితో యువతి ఆత్మహత్య

మేడ్చల్, జూన్ 1 : పరీక్షల ఒత్తిడికి గురై ఓ యువతి ఆత్మహత్య చేసుకొన్నది. ఈ ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకొన్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... నల్లగొండ జిల్లా నకిరేకల్‌కు చెందిన కోమరాజు సైదులు దంపతుల కొడుకు కృష్ణసాయి, కూతురు సంగీత (24) మేడ్చల్‌లోని రాఘవేంద్ర కాలనీలో ఓ గదిని అద్దెకు తీసుకొని ఉంటున్నారు. సంగీత గ్రూప్ 1, ఇతర పోటీ పరీక్షలకు సిద్ధం అవుతుండగా, ఆమె తమ్ముడు కృష్ణసాయి మేడ్చల్ రత్నదీప్‌లో డాటా ఎంట్రీ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. నాలుగు నెలల నుంచి పరీక్షలకు సిద్ధం అవుతున్న సంగీత గత కొన్ని రోజులుగా మానసిక ఒత్తిడికి లోనైంది. తమ్ముడితో పరీక్షలంటే భయంగా ఉన్నదని చెప్పుండేది. సాయికృష్ణ శనివారం ఉదయం విధుల నిమిత్తం రత్నదీప్‌కు వెళ్లాడు. కొద్దిసేపటికీ సంగీతకు ఫోన్ చేయగా తీయలేదు. దీంతో అనుమానంతో కృష్ణసాయి గదికి రాగా, తలుపులకు లోపల గడియ పెట్టి ఉంది. బలవంతంగా తోసుకొని వెళ్లగా, సంగీత ఫ్యాన్‌కు ఉరేసుకొన్నది. పోలీసులు కేసు నమోదు చేశారు.

'టీజీఎస్‌డబ్ల్యూఆర్ఈఈ' అధ్యక్షుడిగా ప్రభుదాస్

హైదరాబాద్, జూన్1 (నమస్తే తెలంగాణ): తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (టీజీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఏ) రాష్ట్ర అధ్యక్షుడిగా వడ్డేపల్లి ప్రభుదాస్, కార్యదర్శిగా పీ సుధాకర్‌ను సంఘం కోర్ కమిటీ సమావేశం ఎన్నుకొన్నది.

ఐఐసీటీలో వాక్ ఇన్ ఇంటర్వ్యూలు

హైదరాబాద్ సిటీబ్యూరో, జూన్ 1(నమస్తే తెలంగాణ): ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీలో రిసెర్చ్ అసోసియేట్, సీనియర్ ప్రాజెక్టు అసోసియేట్, ప్రాజెక్ట్ అసోసియేట్ పోస్టుల కోసం పీహెచ్ సైన్స్, ఎమ్మెస్సీ సైన్స్, బీ ఫార్మా చేసిన వారు ధ్రువీకరణ పత్రాలతో ఈ నెల 11,12,13న వాక్ ఇన్ ఇంటర్వ్యూకు హాజరు కావాలని ఆ సంస్థ తెలిపింది. వివరాలకు ఐఐసీటీ వెబ్‌సైట్‌న సంప్రదించాలి.

రేపు లాసెట్

హైదరాబాద్, జూన్ 1 (నమస్తే తెలంగాణ): లా, పీజీ లా కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే లాసెట్, పీజీ లాసెట్ పరీక్ష సోమవారం జరగనుంది. ఆన్‌లైన్‌లో ఒకేరోజు మూడు సెషన్లలో ఈ పరీక్షను నిర్వహిస్తారు. తెలుగు రాష్ట్రాల నుంచి 50,684 మంది అభ్యర్థులు హాజరవుతారని లా సెట్ కన్వీనర్ విజయలక్ష్మి తెలిపారు. మూడోసెషన్‌లలో పరీక్షలు నిర్వహిస్తారు.

12న టెట్ ఫలితాలు

హైదరాబాద్, జూన్ 1 (నమస్తే తెలంగాణ) : ఉపాధ్యాయ ఉద్యోగార్థులకు నిర్వహించిన టెట్ ఫలితాలు ఈ నెల 12న విడుదలకానున్నాయి. శనివారం జరిగిన పరీక్షలకు 83. 84 శాతం అభ్యర్థులు హాజరైనట్టు టెట్ కన్వీనర్ రాధారెడ్డి తెలిపారు.

రేపటి నుంచి పదోతరగతి అడ్వాన్స్‌డ్ పరీక్షలు

హైదరాబాద్, జూన్ 1 (నమస్తే తెలంగాణ): పదోతరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభంకానున్నాయి. ఈనెల 13 వరకు జరగనున్నాయి. ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు 170 పరీక్షాకేంద్రాల్లో 51,237 విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ కృష్ణారావు తెలిపారు.

నా కొడుకును బతికించండి

- దాతలకు చేనేత కార్మికుడు శ్రీనివాస్ వేడుకోలు
- ఆరు నెలలుగా మరమగ్గాలు నడవక కూలి పనులకు
- భారంగా కుటుంబపోషణ.. కొడుకు గుండెకు సమస్య
- ఆపరేషన్ కోసం రూ. 10 లక్షలు అవుతుందన్న వైద్యులు

సిరిసిల్ల రూరల్, జూన్ 1: సిరిసిల్లలో నేత కార్మికుల పరిస్థితి దయనీయంగా మారుతున్నది. ఆరు నెలల క్రితం వరకు వస్త్ర పరిశ్రమలో చేతినిండా పనితో సంతోషంగా బతికినా.. ఇప్పుడు కుటుంబ పోషణకే కష్టపడాల్సి వస్తున్నది. నేత పనిని వదిలేసి కూలి పనులకు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. ఈ కష్టసమయంలోనే అనారోగ్య సమస్యలు వెంటాడి మరింత కుంగిపోవాల్సి వస్తున్నది. అందుకు జగిత్యాల జిల్లా మల్యాల మండలం సర్వపూర్‌కు చెందిన నేత కార్మికుడు మేర్గ శ్రీనివాస్ దీనగాథే నిదర్శనం. నాలుగేండ్ల క్రితం ఉపాధి కోసం భార్య మంజుల, కొడుకులు అభిషేక్, అనూష-అశోక్ (కవలలు), కార్తికేయ (5)తో వేములవాడకు వలస వచ్చాడు. అక్కడే ఉంటూ నేత కార్మికుడిగా పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కొంత కాలం తర్వాత తంగళ్లపల్లికి వచ్చి ఉంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆరు నెలల క్రితం వరకు మరమగ్గాల కార్మికుడిగా పనిచేశాడు. కేసీఆర్ సర్కారు ఉన్నంత కాలం చేతినిండా పనితో సంతోషంగా బతికిన ఆయన.. అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఆగమయ్యాడు. కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి ఆర్డర్లు లేక, మరమగ్గాలు నడవక చేతినిండా పని దొరకక కుటుంబ పోషణకు కష్టపడుతున్నాడు. భార్య మంజుల బీడీలు చుడుతుండగా.. దొరికిన రోజు కూలి పనులకు వెళ్తూ కాలం వెల్లదీస్తున్నాడు. ఇదే సమయంలో ఆయనకు మరో కష్టం వచ్చిపడింది. కొడుకు కార్తికేయకు మరోసారి గుండె సమస్య రావడంతో తల్లడిల్లిపోతున్నాడు. నాలుగేండ్ల క్రితం ఏడాది వయసున్న కొడుకు గుండెకు రంధ్రం ఉండటంతో రూ.2 లక్షల దాకా ఖర్చు చేసి ఆపరేషన్ చేయించాడు. ఇక కార్తికేయకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు లేవని అనుకుంటున్న తరుణంలోనే మళ్లీ అస్వస్థతకు గురయ్యాడు. కిమ్స్ దవాఖానాలో చూపించగా.. బాబుకు మళ్లీ గుండె సమస్య వచ్చిందని, ఆపరేషన్ చేయాలని వైద్యులు సూచించారు. అందుకు సుమారు రూ.8 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ఖర్చు అవుతుందని చెప్పారు. దీంతో శ్రీనివాస్ ఏం చేయాలో తెలియక తల్లడిల్లిపోతున్నాడు. ఐదు నెలలుగా మందులు వాడుతూ కొడుకును కాపాడుకుంటున్నామని, మందులకు సైతం డబ్బులు లేవని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. దాతలు స్పందించి తమ కొడుకు ఆపరేషన్‌కు సాయం అందించాలని కోరుతున్నాడు. ప్రభుత్వం కూడా స్పందించి తన కొడుకు కార్తికేయకు ఆపరేషన్ చేయించాలని వేడుకుంటున్నాడు.

గుండె సంబంధ వ్యాధితో బాధపడుతున్న చిన్నారి కార్తికేయతో తల్లిదండ్రులు

దాతలు ఇలా సంప్రదించాలి

అకౌంట్ నంబర్: 100320021126886 (గాయత్రీ బ్యాంక్, వేములవాడ)
ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్: HDFCOCTGCUB
బ్రాంచ్ : ది గాయత్రి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్
ఫోన్‌పే నంబర్: 8978396342

కరెంటు కోతలపై నెటిజన్ల ఆగ్రహం

- ఎక్స్(ట్విట్టర్)లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోస్టుల వెల్లువ
- కేటీఆర్‌కు అందుతున్న పోస్టులు మంత్రికి ట్యాగ్.. రీట్వీట్

హైదరాబాద్, జూన్ 1 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో విద్యుత్తు కోతలు లేవంటూ ఓ వైపు ప్రభుత్వం ప్రకటనలు గుప్పిస్తుండగా, మరోవైపు కరెంటు సమస్యలపై ట్విట్టర్‌లో పోస్టులు వెల్లువెత్తుతున్నాయి. విద్యుత్తు కోతల వల్ల ఎదురవుతున్న ఇబ్బందులను ప్రస్తావిస్తూ నెటిజన్లు ట్విట్టర్ వేదికగా మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు పోస్టులు పెడుతున్నారు. దీనిపై కేటీఆర్ స్పందిస్తూ.. 'మేము అధికారంలో ఉంటే ఏమైనా చేసేవాళ్లం కానీ ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంది. మార్పు తెస్తామనే హామీతో వారు అధికారంలోకి వచ్చారు. మీ ట్వీట్‌లు విద్యుత్తు శాఖ మంత్రికి చేరే విధంగా ప్రయత్నిస్తాను' అని కేటీఆర్ పేర్కొన్నారు.

కరెంట్ కోతలే లేవని ప్రకటిస్తున్న విద్యుత్తు శాఖ మంత్రి భట్టి విక్రమార్కను ట్యాగ్ చేస్తూ నెటిజన్ల ట్వీట్లను రీట్వీట్ చేశారు.

పదేండ్లకు మళ్లీ చీకట్లు

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక తెలంగాణలో మళ్లీ చీకట్లు మొదలయ్యాయి. కరెంట్ కోతలు నిత్యకృత్యమయ్యాయి. విద్యుత్తు కోతలే లేకుండా పవర్ సెక్టార్‌లో బీఆర్‌ఎస్ సృష్టించిన మౌలిక సదుపాయాలను కూడా వాడుకోలేని స్థితిలో రేవంత్‌రెడ్డి సర్కారు ఉన్నదన్న విమర్శలు మొదలయ్యాయి. 2014కు ముందు తరుచూ విద్యుత్తు కోతలు, పవర్ హాలిడేస్ తెలిసిందే. ఆ పరిస్థితిని పూర్తిగా మార్చేసిన ఘనత కేసీఆర్ సర్కార్‌దే. 24 గంటల నాణ్యమైన కరెంట్ సరఫరా చేయటం వల్ల అభివృద్ధిలో హైదరాబాద్ దూసుకుపోయే పరిస్థితి వచ్చింది. కాగా, కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ పదేండ్ల క్రితం నాటి పాత రోజులను తిరిగి తీసుకొచ్చిందని నెటిజన్లు మండిపడుతున్నారు. తరుచూ విద్యుత్తు కోతలతో అటు ప్రజలకు, ఇటు పరిశ్రమలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. విద్యుత్తు కోతలు లేకుండా కేసీఆర్ చేసిందేమిటని కొందరు అడుగుతున్నారు.. వాళ్లకోసం ఈ వివరాలు అందిస్తున్నట్టు కేటీఆర్ తెలిపారు.

కేసీఆర్ హయాంలో ప్రగతి ఇలా...

- 1,110 యూనిట్లుగా ఉన్న తలసరి వినియోగం 2,110 యూనిట్లకు చేరిక.
- సౌర విద్యుత్తు సామర్థ్యం 71 మెగావాట్ల నుంచి 5,000 మెగావాట్లకుపైగా పెంపు.
- స్థాపిత విద్యుత్తు సామర్థ్యం 7,778 మెగావాట్ల నుంచి 18,000 మెగావాట్లకు చేరిక. (యాదాద్రి పవర్‌ప్లాంట్ అందుబాటులోకి వస్తే 25 వేల మెగావాట్లకు చేరుతుంది.)
- ట్రాన్స్‌మిషన్ సామర్థ్యం 13,900 నుంచి 37,000 మెగావాట్ల వరకు పెంపు
- 2014కు ముందు వ్యవసాయానికి రెండు దఫాలుగా 6 గంటలు ఉచిత విద్యుత్తు ఉండగా.. కేసీఆర్ పాలనలో వ్యవసాయానికి 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్తు అందుబాటులో ఉన్నది.
- 2014 వరకు రోజులో డొమెస్టిక్ యూజర్లకు 4 నుంచి 8 గంటల వరకు లోడ్ రిలీఫ్ ఉండేది, కేసీఆర్ అధికారంలోకి వచ్చాక ఆ అవసరమే లేకుండా చేశారు.
- 2014 వరకు వారంలో 3 రోజుల పవర్ హాలిడేస్ ఉండేవి. కేసీఆర్ పాలనలో పవర్ హాలిడేస్ అనే మాటే లేదు.

కరెంట్ కోతలపై కన్నెర్ర

దుండిగల్,జూన్1: 33/11కేవీ బాచుపల్లి సబ్‌స్టేషన్, పలు ఫీడర్ల పరిధిలో రాత్రి 10.30 గంటల నుంచి 3 గంటల పాటు విద్యుత్తు సరఫరా నిలిచిపోవడంతో సాయినగర్, ఇంద్రానగర్, ప్రగతినగర్‌లోని జీపీఆర్ లేఅవుట్ కాలనీవాసులు సబ్‌స్టేషన్ ఎదుట బైఠాయించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కరెంటు కోతలు పెరిగిపోయాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాత్రి 1.30 గంటలకు సరఫరా పునరుద్ధరించడంతో ఆందోళన విరమించారు. ఓవర్‌లోడ్ కారణంగా సరఫరా నిలిచిపోయిందని ఏఈ శాంతకుమార్ తెలిపారు. బొల్లారంలోని టీనా ల్యాబ్ వద్ద జంపర్ కట్ కావడంతో వైరుకింద పడి మంటలు చెలరేగినట్లు పేర్కొన్నారు. మరమ్మతుల అనంతరం సరఫరా చేశారు.

వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండండి

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్, జూన్ 1 (నమస్తే తెలంగాణ): వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో విద్యుత్తు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు ఆదేశించారు. శనివారం సచివాలయంలో విద్యుత్తుశాఖ అధికారులతో ఆయన సమీక్షా సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. వర్షాలు, ఈదురు గాలులతో చెట్లు విరిగిపడడం, విద్యుత్తు స్తంభాలు కూలిపోవడం, విద్యుత్ తీగలు ఊడిపడడం జరుగుతుంటాయని, క్షేత్రస్థాయి సిబ్బంది తక్షణమే స్పందించి సామాన్యులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. ఇంధన శాఖ ప్రధాన కార్యదర్శి ఎస్‌ఎంఏ రిజ్వీ, టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ, ట్రాన్స్‌కో జేఎండీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎగ్జిట్‌పోల్స్‌లో మిశ్రమ ఫలితాలు

- బీఆర్‌ఎస్‌కు అధిక సీట్లు అన్న సీప్యాక్, న్యూస్18
- పోటీ కాంగ్రెస్, బీజేపీ మధ్యే అంటున్న ఇతర సర్వేలు

హైదరాబాద్, జూన్ 1 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని 17 పార్లమెంటు స్థానాలకు జరిగిన ఎన్నికలకు సంబంధించి వివిధ సంస్థలు నిర్వహించిన ఎగ్జిట్‌పోల్ సర్వేల్లో మిశ్రమ ఫలితాలు వెల్లడయ్యాయి. కొన్ని సంస్థలు కాంగ్రెస్, బీజేపీలకు అధిక స్థానాలు వచ్చే అవకాశం ఉందని అంచనా వేయగా.. మరికొన్ని సంస్థలు బీఆర్‌ఎస్‌కు ఎక్కువ సీట్లు వచ్చే అవకాశమున్నదని వెల్లడించాయి. సీ-ప్యాక్ సంస్థ బీఆర్‌ఎస్ 11సీట్లకు పైగా గెలుచుకుంటుందని అంచనా వేయగా, న్యూస్-18 మాత్రం రెండు నుంచి ఐదు స్థానాలు సాధించే వీలున్నదని తెలిపింది. సునీల్ వీర్ బృందం బీఆర్‌ఎస్ రెండు సీట్లకన్నా ఎక్కువ సాధించే అవకాశం ఉన్నదని అంచనా వేసింది. దాదాపు అన్ని సర్వే సంస్థలు మజ్లిస్ పార్టీ ఒక సీటు సాధిస్తుందని పేర్కొన్నాయి.

సర్వే సంస్థల ఎగ్జిట్‌పోల్ అంచనాలు, ఓట్ల శాతం

సంస్థ	కాంగ్రెస్	బీజేపీ	బీఆర్‌ఎస్	ఎంఐఎం
కేస్ స్టడీస్	9-13(45-55)	3-7(28-35)	0-1(11-16)	1
పొలిటికల్ ల్యాబొరేటరీ	6+/-1(39.12)	9+/-1(36.49)	1+/-1(18.51)	1
సునీల్ వీర్, బృందం	2+/-1(22.59)	10+/-1(44.50)	2+/-1(26.90)	1(6.10)
న్యూస్ 18	5-8(34)	7-10(37)	2-5(21)	0-1(8)
ఆరా	7-8(38.43)	8-9(36.65)	0(18.99)	1(5.93)
సీ ప్యాక్	2	2	11+1	1
జనం సాక్షి	5-8	8-11	0-1	1-1
ఇండియా టీవీ-సీఎన్ఎక్స్	6-8	8-10	0-1	1
జన్ కీ బాత్	7-8	9-11	0-1	1
న్యూస్ మినిట్	2	8-12	0-1	0-1
ఏబీపీ	7-9	7-9	0-1	0-1
టీవీ9	8	7	1	1
సీపీ&పీ	8-9	7-8	0	1
సీ ఓటర్	7-9	7-9	0-1	0-1
పీపుల్స్ పల్స్	7-9	6-8	1	1

రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌దే ఆధిపత్యం

11 పార్లమెంట్ స్థానాల్లో గులాబీ జయకేతనం • సికింద్రాబాద్-కంటోన్మెంట్, ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లోనూ కారుదే జోరు • వెల్లడించిన సీ-ప్యాక్ సర్వే

హైదరాబాద్, జూన్ 1 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ తిరుగులేని ఆధిక్యతను సొంతం చేసుకోబోతున్నదని సీ-ప్యాక్ (సివిక్ పోల్ ఎనాలసిస్ కమిటీ) సర్వే వెల్లడించింది. లోక్‌సభ ఎన్నికల ఎగ్జిట్ పోల్స్ వివరాలను సీ-ప్యాక్ కిరణ్ శనివారం వివరించారు. ఈ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కే తెలంగాణ ప్రజలు జైకొట్టినట్టు తెలిపారు. కాంగ్రెస్ సింగిల్ డిజిట్‌కే పరిమితం అవుతుందని తేల్చి చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా తమ సర్వే నూరుపాళ్లు నిజమైనట్టే లోక్‌సభ ఎన్నికల్లో కూడా నిజమని తేలుతుందని స్పష్టంచేశారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు 44.95 శాతం, కాంగ్రెస్‌కు 27.56 శాతం, బీజేపీకి 26.38 శాతం, ఎంఐఎంకు 0.77 శాతం ఓట్లు వచ్చినట్టు సీప్యాక్ సర్వే అంచనా వేసింది. సీట్లవారీగా చూస్తే బీఆర్‌ఎస్‌కు 11, బీజేపీకి 2, కాంగ్రెస్‌కు ఒక్క సీటు మాత్రమే రావొచ్చని పేర్కొంది. ఇక ఎంఐఎంకు తన సీటును పదిలపరుచుకుంటుందని తెలిపింది. రెండు స్థానాల్లో బీజేపీ, బీఆర్‌ఎస్, కాంగ్రెస్ మధ్య టఫ్ ఫైట్ ఉంటుందని వెల్లడించింది.

సీ-ప్యాక్ సర్వే ప్రకారం..

పార్టీ	సీట్ల సంఖ్య
బీఆర్‌ఎస్	11
కాంగ్రెస్	01
బీజేపీ	02
టఫ్‌ఫైట్	02
ఎంఐఎం	01

అసెంబ్లీ ఎన్నికల్లో నిజమైన అంచనాలు

గత శాసనసభ ఎన్నికల్లో సీప్యాక్ ఎగ్జిట్‌పోల్ అంచనాలు వాస్తవ ఫలితాలకు దగ్గరగా ఉన్నాయి. కాంగ్రెస్‌కు 60, బీఆర్‌ఎస్‌కు 40, బీజేపీకి 4, బీఎస్పీ 2, ఎంఐఎం 5, ఎంబీటీ 1, సీపీఐ ఒక స్థానాల్లో గెలుస్తాయని ఎగ్జిట్ పోల్స్‌లో అంచనా వేసింది. ఓట్ల లెక్కింపు అనంతరం వెలువడిన ఫలితాల్లో కాంగ్రెస్ 64, బీఆర్‌ఎస్ 39, బీజేపీ 8, ఎంఐఎం 7, సీపీఐ ఒక స్థానాల్లో విజయం సాధించాయి. ఈ నేపథ్యంలో సీప్యాక్ సర్వే తెలంగాణలోని రాజకీయపార్టీల్లో ఉత్కంఠ రేపుతున్నది.

లోకసభ నియోజవర్గాలవారీగా గెలుపొందే పార్టీ

ఆదిలాబాద్ (బీజేపీ), పెద్దపల్లి (బీఆర్‌ఎస్), కరీంనగర్ (బీఆర్‌ఎస్), మెదక్ (బీఆర్‌ఎస్), జహీరాబాద్ (బీఆర్‌ఎస్), చెవెళ్ల (బీఆర్‌ఎస్), నాగర్‌కర్నూల్ (బీఆర్‌ఎస్), మహబూబ్‌నగర్ (బీజేపీ), సికింద్రాబాద్ (బీఆర్‌ఎస్), హైదరాబాద్ (ఎంఐఎం), మల్కాజ్‌గిరి (బీఆర్‌ఎస్), మహబూబాబాద్ (బీఆర్‌ఎస్), నల్గొండ (కాంగ్రెస్), ఖమ్మం (బీఆర్‌ఎస్), నిజామాబాద్ (బీఆర్‌ఎస్/బీజేపీ), భువనగిరి (బీఆర్‌ఎస్/కాంగ్రెస్)

బీఆర్‌ఎస్‌కే జైకొట్టిన పట్టభద్రులు

ఇటీవల జరిగిన ఖమ్మం, వరంగల్, నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నికలో బీఆర్‌ఎస్ విజయం సాధించనుందని సీప్యాక్ సర్వే ప్రకటించింది. ఈ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు 41.17 శాతం, కాంగ్రెస్‌కు 33.81 శాతం, బీజేపీకి 13.26 శాతం ఓట్లు వస్తాయని వెల్లడించింది. ఇతరులకు 8.52 శాతం, నోటాకు 3.24 శాతం ఓట్లు పోలైనట్టు తెలుస్తున్నదని సీప్యాక్ వెల్లడించింది.

సికింద్రాబాద్-కంటోన్మెంట్‌లోనూ కారు జోరు

సికింద్రాబాద్-కంటోన్మెంట్ అసెంబ్లీ స్థానాన్ని బీఆర్‌ఎస్ నిలుపుకుంటుందని సీప్యాక్ సర్వే స్పష్టంచేసింది. ఈ స్థానానికి జరిగిన ఉప ఎన్నికలో పోలైన ఓట్లలో బీఆర్‌ఎస్‌కు 50.49 శాతం, కాంగ్రెస్‌కు 37.29 శాతం, బీజేపీకి 11.63 శాతం, ఇతరులకు 0.59 ఓట్లు రానున్నాయని అంచనావేసింది.

ఉమ్మడి ముచ్చట ముగిసినట్టే

› మొదటిపేజీ తరువాయి...

విభజన సమస్య గతంలోనే పరిష్కారమైంది. 2018 డిసెంబర్ 18న నోటిఫికేషన్ విడుదలై, 2019 జనవరి 1న ఏపీ తాత్కాలిక హైకోర్టు ఏర్పాటైంది. ఢిల్లీలోని ఉమ్మడి భవన్ విభజన పూర్తయింది. ఏపీ, తెలంగాణ భవన్‌కు స్థలాలను కేటాయించారు.

విద్యావకాశాలు ఈ ఒక్క ఏడే..

సెక్షన్-95 ప్రకారం విద్యార్థులకు పదేండ్ల పాటు ఉన్నత విద్యలో అవకాశాలు కల్పించారు. ఆర్టికల్ -317 డీ ప్రకారం అడ్మిషన్ల కోటా పదేండ్ల వరకు కొనసాగించాలి. ఎప్‌సెట్ సహా 7 రకాల ప్రవేశ పరీక్షల నోటిఫికేషన్లు జూన్ 2కు ముందే విడుదల కావటంతో అవకాశాలు కల్పించాల్సి వచ్చింది. ఈ ఒక్క సంవత్సరం ఏపీ విద్యార్థులకు తెలంగాణలో సీట్లు కేటాయిస్తారు. 15 శాతం ఓపెన్‌కోటాలో మెరిట్‌లో ఏపీ వాళ్లతో పాటు, తెలంగాణ విద్యార్థులు సీట్లను దక్కించుకునే అవకాశం ఉన్నది.

ఇంకా అపరిష్కృతంగానే..

ఇదిలా ఉంటే అనేక సమస్యలు అపరిష్కృతంగానే ఉన్నాయి. కృష్ణా, గోదావరి జలాల పంపిణీ గుదిబండగా మారింది. అపెక్స్ కమిటీలు, నదీ యాజమాన్య బోర్డుల మధ్యే నలుగుతున్నది. దీనిపై కేంద్రం ఎటూ తేల్చటం లేదు. రాష్ట్ర విభజన చట్టం తొమ్మిదో షెడ్యూల్‌లోని ప్రభుత్వ సంస్థలు, పదో షెడ్యూల్‌లోని సంస్థల విభజన తేలలేదు. 68 సంస్థల విభజనకు ఎలాంటి అభ్యంతరం లేదని తెలంగాణ తెలిపింది. ఏపీ ముందుకురాకపోవటంతో వీటి విభజన పూర్తికాలేదు. ఆస్తుల పంపిణీ వివాదాలు, ప్రభుత్వ కార్యాలయాల స్వాధీనం ఇంకా జరగలేదు. స్థానికత ఆధారంగా ఉద్యోగులను కేటాయించాలని ఉద్యోగసంఘాలు కోరినా ఇప్పటి వరకు ఫలితం లేకుండా పోయింది. తెలంగాణకు ప్రయోజనం చేకూర్చాలని పదేండ్ల బీఆర్‌ఎస్ సర్కారు కాళ్లరిగేలా తిరిగినా కేంద్రం కనికరించలేదు. విభజన చట్టంలో పేర్కొన్న హామీలను గాలికొదిలేసింది. కాజీపేట రైల్వేకోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు పరిశ్రమలు ఏర్పాటు చేయలేదు. జాతీయ ప్రాజెక్ట్ కేటాయింపు, వెనుకబడిన జిల్లాలకు నిధులు, అసెంబ్లీ స్థానాల పెంపును పక్కనపెట్టేసింది. పదేండ్ల పోరాటం తర్వాత గిరిజన వర్సిటీని ఏర్పాటు చేసింది.

కౌంటింగ్‌కు సర్వం సిద్ధం

- ఎల్లుండి సాయంత్రం నాలుగులోగా తుది ఫలితాలు
- లోక్‌సభ ఓట్ల లెక్కింపునకు మూడంచల భద్రత
- మొత్తం 120 కౌంటింగ్ హాళ్లు.. 10 వేల సిబ్బంది
- రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్ వెల్లడి

హైదరాబాద్, జూన్ 1 (నమస్తే తెలంగాణ): ఈ నెల 4న రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు పూర్తిచేశామని, అదేరోజు సాయంత్రం నాలుగు గంటల కల్లా తుది ఫలితాలు వస్తాయని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్ వెల్లడించారు. హైదరాబాద్ బీఆర్‌కేఆర్ భవన్‌లో శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. మే 13న జరిగిన 17 లోక్‌సభ ఎన్నికల్లో 2.20 కోట్ల మంది ఓటు హక్కు వినియోగించుకున్నారని తెలిపారు. మంగళవారం ఉదయం 8 నుంచి లెక్కింపు ప్రారంభమవుతుందని, ఈవీఎంలు, పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపునకు వేర్వేరుగా హాళ్లు ఏర్పాటు చేశామని, సమాంతరంగా ఓట్ల లెక్కింపు సాగుతుందని చెప్పారు. రాష్ట్రంలోని 34 చోట్ల 120 హాళ్లలో 1,855 టేబుళ్లలో ఈవీఎం ఓట్ల లెక్కింపు జరుగుతుందని, 2.18 లక్షల పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపునకు 19 హాళ్లు, 276 టేబుళ్లు ఏర్పాటుచేశామని వివరించారు. చేవేళ్ల, మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గాల్లో రెండు చొప్పున, మిగిలిన అన్ని నియోజకవర్గాల్లో ఒక్కొక్కటి చొప్పున హాళ్లు ఏర్పాటు చేశామని చెప్పారు. ఓట్ల లెక్కింపునకు కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రతను ఏర్పాటుచేశామని, బందోబస్తుకు 12 కంపెనీల కేంద్ర బలగాలతో సహా రాష్ట్ర పోలీసులను వినియోగిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో అత్యధికంగా 24 రౌండ్లలో లెక్కింపు జరుగుతుందని తెలిపారు.

నేడు మహబూబ్‌నగర్, 5న నల్లగొండ ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు

గత మార్చి 28న జరిగిన మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల శాసనమండలి ఉప ఎన్నికల ఓట్ల లెక్కింపు ఆదివారం ఉదయం 8 గంటలకు ప్రారంభమవుతుందని వికాస్‌రాజ్ తెలిపారు. మే 27న జరిగిన నల్లగొండ, ఖమ్మం, వరంగల్ జిల్లా గ్రాడ్యుయేట్ శాసన మండలి ఉప ఎన్నిక ఓట్ల లెక్కింపు ఈనెల 5న జరుగుతుందని పేర్కొన్నారు.

ఈ నెలలోనే టీచర్ల బదిలీలు, పదోన్నతులు

ఎన్నికల కోడ్ ముగియగానే షెడ్యూల్ ప్రకటించే అవకాశం

హైదరాబాద్, జూన్ 1 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో నిలిచిపోయిన టీచర్ల పదోన్నతులు, బదిలీల ప్రక్రియ మళ్లీ మొదలుకానున్నది. ముందు పదోన్నతులు కల్పించి, ఆ తర్వాత బదిలీలు చేపట్టాలని ప్రభుత్వం భావిస్తున్నది. ఎన్నికల కోడ్ ముగియగానే సీఎం రేవంత్‌రెడ్డి అనుమతి తీసుకుని షెడ్యూల్ ప్రకటించాలని అధికారులు భావిస్తున్నారు. బదిలీలు, పదోన్నతులు చేపట్టేందుకు అడ్డంకులన్నీ (కోర్టు కేసులు) ఇటీవల తొలగిపోయాయి. ఈ నేపథ్యంలో జూన్‌లోనే బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని విద్యాశాఖ కసరత్తుచేస్తున్నది.

స్థానిక ఎన్నికల్లో టీడీపీ పోటీ

హైదరాబాద్, జూన్ 1(నమస్తే తెలంగాణ): తెలంగాణలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ పోటీ చేస్తుందని, అందుకోసం నేతలంతా సిద్ధంగా ఉండాలని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు అన్నారు. ఈ మేరకు ఆయన కీలక నిర్ణయం తీసుకున్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో తెలంగాణ టీడీపీ నాయకులతో సమావేశమై టీడీపీ బలోపేతంపై చర్చించారు. ఇక నుంచి తెలంగాణ రాజకీయాలకు సమయం కేటాయిస్తానని తెలిపారు.

ఆంధ్రప్రదేశ్‌లో కన్‌ఫ్యూజన్!

- కొన్ని సర్వేలు టీడీపీకి.. మరికొన్ని వైసీపీకి మొగ్గు!
- లోక్‌సభ స్థానాల్లో కొంత టీడీపీకి అనుకూలం

హైదరాబాద్, జూన్ 1 (నమస్తే తెలంగాణ): ఏపీలో ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు భిన్నంగా వచ్చాయి. ఏ పార్టీ అధికారంలోకి వస్తుంది? అన్న అంశాన్ని మాత్రం కచ్చితంగా చెప్పలేకుండాపోతున్నాయి. కొన్ని సర్వే సంస్థలు టీడీపీకి, మరికొన్ని సర్వే సంస్థలు వైసీపీకి అనుకూలంగా ఫలితాలు ఇచ్చాయి. దీంతో ఏపీలో ఏ పార్టీ అధికారం ఏర్పాటు చేస్తుంది? అన్న అంశంపై స్పష్టత రాలేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పోటీ మాత్రం టీడీపీ, వైసీపీ మధ్యే ఉన్నట్టు ఎగ్జిట్ పోల్స్ చూపిస్తున్నాయి. రైజ్, జనగళం, చాణక్య స్ట్రాటజీస్, పయనీర్, పీపుల్స్ పల్స్, కేకే సర్వేస్, నేషనల్ ఫ్యామిలీ ఒపీనియన్ ప్రైవేట్ లిమిటెడ్ వంటి సంస్థలు టీడీపీ కూటమికి అనుకూలంగా ఎగ్జిట్ పోల్స్ చూపించాయి. ఆరా, ఎస్ఏఎస్, రేస్, పోల్‌స్ట్రాటజీ, ఆగ్నివీర్, సీపీఎస్ వంటి పలు రకాల సర్వే సంస్థల సర్వేల్లో వైసీపీకి అనుకూలంగా వచ్చాయి. లోకసభ స్థానాల్లో మాత్రం అధిక ఏజెన్సీలు కొంత వరకు టీడీపీ కూటమికే అనుకూల ఫలితాలు చూపాయి.

అసెంబ్లీ ఎన్నికలు-ఎగ్జిట్ పోల్స్

సర్వే సంస్థ	టీడీపీ	వైసీపీ	ఇతరులు
ఆరా	71-81	94-104	0-0
పార్థ చాణక్య	55-65	110-120	0-0
రేస్	48-58	117-128	0-0
పోల్‌స్ట్రాటజీ	50-60	115-125	0-0
ఆగ్నివీర్	46-49	124-128	0-0
సీపీఎస్	66-78	97-108	0-0
రైజ్	113-122	48-60	0-1
జనగళం	104-118	44-57	0-0
చాణక్య స్ట్రాటజీస్	114-125	39-49	0-1
పయనీర్	114	31	0-0
పీపుల్స్‌పల్స్	111-135	45-60	0-0
కేకే సర్వేస్	161	14	0-0
నేషనల్ ఫ్యామిలీ ఒపీనియన్	104-110	65-71	0-0
ఫోరెన్సిక్ ఎలక్ట్రికల్ సర్వే	32-63	112-143	31
ఎస్ఏఎస్	59-77	98-116	0

లోక్‌సభ ఎన్నికలు-ఎగ్జిట్ పోల్స్

సర్వే సంస్థ	టీడీపీ	వైసీపీ	ఇతరులు
సీఎన్ఎన్ న్యూస్	18	19-22	5-80
టైమ్స్ నౌ	11	14	0
ఎన్డీటీవీ	18	7	0
ఇండియా న్యూస్	18	7	0
న్యూస్ నేషన్	19	6	0
ఆరా	10-12	13-15	0
ఇండియాటీవీ	19-21	3-5	0
రైజ్	17-20	7-10	0
చాణక్య స్ట్రాటజీస్	17-18	6-7	0
పయనీర్	20	5	0
పీపుల్స్ పల్స్	17-19	3-5	0
కేకే సర్వేస్	25	0	0
సీఎన్ఎక్స్	19-21	3-5	0
ఇండియా న్యూస్-డీ-డైనమిక్స్	18	7	0
నేషనల్ ఫ్యామిలీ ఒపీనియన్ ప్రైవేట్ లిమిటెడ్	15-18	7-10	0
ఎస్ఏఎస్	16-17	8-9	0